తొండలు గుడ్లుబెట్టిన భూములు బంగారమైనయ్

కేసీఆర్ సార్ పాలనే బాగుండే. నీళ్ల చుక్క లేని మా భూములకు గోదారి నీళ్లు తెచ్చి, భూమికి బరువైన పంటలు పండించేలా చేసిండు. రైతుబంధు, రైతు బీమా ఇచ్చిండు. మిషన్ భగీరథ నీళ్లతో ఇంటింటికీ మంచినీళ్లు అందించిండు. కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోసి ఎండాకాలంలో కూడా చెర్లు మత్తళ్లు దుంకించిండు. సారు కృషితోనే తొండలు గుడ్లుపెట్టిన మా భూములు ఇప్పుడు బంగారంగా మారినయ్. పదేండ్ల కింద ఎకరం ధర రూ.20వేలుంటే, రెండేండ్ల కింద రూ.30 లక్షలకు పెరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చుడుతోనే నీళ్ల ఎత్తిపోసుడు నిలిచింది. బాయిలు, బోర్లు అడుగంటినయి.

- కవ్వంపల్లి బానయ్య, సుల్తాన్‌పూర్ గ్రామం, ఎలిగేడు మండలం

మోసపోయినం.. గోసపడుతున్నం

ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన మాయమాటలు నమ్మి ఓట్లేసినం. ఇప్పుడు గోసపడుతున్నం. రైతుబంధుకు రాంరాం అన్నది. సన్న వడ్లకు బోనస్ ఇస్తలేదు. ఇదేందని అడిగినందుకు పోలీసులతో కేసులు పెట్టిస్తున్నరు. ఎలాంటి హామీలివ్వని కేసీఆర్ మాలాంటి పేద రైతులకు అవసరమైన అన్ని పథకాలు అమలు చేసిండు. కానీ రేవంత్ ప్రభుత్వం ఆ పథకాలన్నీ నిలిపేసింది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేతులెత్తేసింది. ప్రజలను నట్టేట ముంచింది. ఊ అంటే, ఆ అంటే ఢిల్లీకి పోతున్న రేవంత్, కాంగ్రెస్ పెద్దల మెప్పు పొందే సరికే పుణ్యకాలం అయిపోతది.

.- ఎం రఘుపతిరావు, కాట్నపల్లి, పెద్దపల్లి జిల్లా

కేసీఆరే మమ్ముల్ని కాపాడాలే

అరచేతిలో వైకుంఠంచూపిన రేవంత్‌రెడ్డి తన చేతకాని పాలనతో మాలాంటి పేదోల్లం కటిక దరిద్రులుగా మారుతున్నం. నీళ్ల లేక కాల్వలు, చెరువులు ఎండిపోతున్నాయి. యాసంగి పంటలన్నీ మాడిపోయి, పశువులకు మేతగా మారుతున్నాయి. కేసీఆర్ కాలంలో అడగక ముందే అన్నిపథకాలు అందినయి. రేవంత్‌రెడ్డి అధికారంలకు వస్తే మరిన్ని ఎక్కువ పథకాలు అమలు చేస్తనని చెప్పిండు. ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటివరకు ఒక్కటీ అమలు చేయలే. కేసీఆర్ పథకాలన్నీ నిలిపేసిండు. మా ఊరిలో సానమందికి రుణమాఫీ కాలేదు. నాకు రూ.1.40 లక్షల బ్యాంకు రుణమున్నా మాఫీ చేయలేదు.

- నక్క హన్మాండ్లు, రంగంపేట, వీర్నపల్లి మండలం, సిరిసిల్ల జిల్లా

కాంగ్రెస్‌కు ఓటేసినం.. పథకాలు బందైనయ్

అధికారం కోసం రేవంత్‌రెడ్డి హామీల మీద హామీలిస్తే, నమ్మి ఓట్లేసినం. ఇప్పుడు ఆగమైతున్నం. గ్యాస్ ఫ్రీ అన్నడు. నెలకు రూ.2,500 ఇస్తనన్నడు. ఇంటింటికీ రెండు ఫించన్లన్నడు. కాలేజీకి పోయే ఆడిపిల్లలకు స్కూటీలిస్తనన్నడు. కళ్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామంటే ఆశపడ్డం. ఇట్ల ఎన్నెన్నో ఆశలు కల్పించి కుర్చీల కూసున్నడు. అన్నీ మర్చిపోయిండు. కేసీఆర్ ఇచ్చిన అన్ని పథకాలు బందైనయి. కొన్ని పథకాలు మాత్రం పేర్లు మార్చిండు. అవి కూడా కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే పంపిణీ చేస్తున్నడు. ఇదేం అన్యాయం. ఇదెక్కడి అక్రమం. ఏడాదిన్నరలోనే అల్లకల్లోలం చేసిండు.

- చొప్పరి రాజేశ్వరి, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న పార్టీ శ్రేణులు

చెక్కు చెదరని అభిమానం

- కరీంనగరం.. గులాబీమయం
- తరలివచ్చిన గులాబీ శ్రేణులు
- కేటీఆర్‌కు అడుగడుగునా ఘన స్వాగతం పలికిన ప్రజలు
- మంకమ్మతోట నుంచి బొమ్మకల్ వరకు వెయ్యి బైక్‌లతో ఐదు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ
- దారిపొడువునా నినాదాల హోరు
- బీఆర్‌ఎస్‌పై అభిమానం చెక్కు చెదరలేదని మరోసారి నిరూపితం
- దళిత సంఘాలకు మాజీ మంత్రి కేటీఆర్ సంఘీభావం



అభిమాన నేత కేటీఆర్‌ను చూసి మురిసిపోతున్న యువకులు

కరీంనగర్, మార్చి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కరీంనగర్ నమస్తే తెలంగాణ: అధికారం ఉన్నా, లేకున్నా.. బీఆర్‌ఎస్‌పై అభిమానం చెక్కుచెదర లేదని నిరూపితమైంది. ఏ మాత్రం వాడి తగ్గని గులాబీ దళం తన సత్తా ఏమిటో చూపింది. తమ అభిమాన నేత కరీంనగర్ వస్తున్న విషయాన్ని తెలుసుకొని పెద్ద ఎత్తున యువత స్వచ్ఛందంగా తరలివచ్చింది. 5 కిలోమీటర్ల వరకు సాగిన ర్యాలీ ఆద్యంతం 'జై తెలంగాణ' 'జై కేసీఆర్ 'జై కేటీఆర్' నినాదాలతో హోరెత్తింది. కేటీఆర్‌ను చూడగానే 'సీఎం, సీఎం' అన్న అభిమానుల నినాదాలు నింగినంటాయి. కేటీఆర్ సహా గులాబీ నేతలపై వీధుల్లో పూల వర్షం కురిపించిన దృశ్యాలు అభిమానానికి నిలువెత్తు నిదర్శనంగా సాక్షాత్కరించాయి. వచ్చే నెల 27న వరంగల్ నగరంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలకు సన్నాహక సభ నిర్వహణ కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కరీంనగర్ వచ్చిన

గుండెలపై ప్రియతమ నేత

సందర్భంగా ఆవిష్కృతమైన దృశ్యాలివి. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో, తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలే కాకుండా అభిమానులు, సామాన్యులు కూడా కేటీఆర్‌ను చూసేందుకు ఆసక్తిని చూపారు.

ర్యాలీల హోరు.. గులాబీ జోరు

హైదరాబాద్ నుంచి నేరుగా కరీంనగర్‌కు చేరుకున్న కేటీఆర్‌కు అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. మొదట తిమ్మాపూర్ మండలం రేణికుంటలోని టోల్‌గేట్ వద్ద కేటీఆర్‌కు మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో ఘనస్వాగత పలికారు. పెద్ద సంఖ్యలో కార్లు, బైక్‌లపై యువకులు, పార్టీ శ్రేణులు స్వాగతం పలికి రాజీవ్ రహదారి మీదుగా ర్యాలీలుగా వచ్చారు. తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆవిష్కరించాలని కొద్ది రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న దళిత సంఘాలకు కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. వెంటనే విగ్రహాలను ఆవిష్కరించుకునేందుకు అవకాశం ఇవ్వాలని, లేదంటే తామే ఆ ముసుగులు తొలగిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. అక్కడి నుంచి తిమ్మాపూర్‌లోని స్థానిక నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌కు వెళ్లిన కేటీఆర్ అక్కడ కొద్దిసేపు తిమ్మాపూర్, మానకొండూర్ తదితర మండలాల కార్యకర్తలతో ముచ్చటించారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా అల్గునూర్ మీదుగా ఎన్‌టీఆర్ విగ్రహం వరకు చేరుకున్న కేటీఆర్‌కు అక్కడ కూడా బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సిరిసిల్ల బైపాస్ మీదుగా మంకమ్మతోట వరకు చేరుకున్నారు. ఇక్కడి సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మరో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, నగర పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

మంకమ్మతోటలో జనజాతర

కరీంనగర్‌లోని మంకమ్మతోటలో కేటీఆర్‌ను చూసేందుకు కార్యకర్తలతోపాటు సామాన్యులు కూడా ఎగబడ్డారు. క్రేన్ సహాయంతో భారీ గజమాలతో కేటీఆర్‌ను సత్కరిస్తుండగా, అభిమానులు, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. 'సీఎం సీఎం' అంటూ నినాదాలు చేశారు. దాదాపు 1,000 మోటర్ సైకిళ్లు, కార్లు ముందూ, వెనుక అనుసరిస్తుండగా కేటీఆర్ భారీ ర్యాలీ సాగింది. మంకమ్మతోట నుంచి హౌసింగ్ బోర్డ్ కాలనీ వరకు భారీ ర్యాలీ సాగింది. అక్కడి నుంచి బొమ్మకల్‌లోని వీ కన్వెన్షన్‌కు కేటీఆర్ చేరుకోగానే బీఆర్‌ఎస్ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు..

కార్యకర్తల జోరు.. నినాదాల హోరు

బొమ్మకల్‌లోని వీ కన్వెన్షన్‌లోకి కేటీఆర్ అడుగు పెట్టగానే కార్యకర్తల్లో ఒక్కసారిగా అభిమానం ఉప్పొంగింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. సీఎం, సీఎం అంటూ కేరింతలు కొట్టారు. 'జై తెలంగాణ' 'జై కేసీఆర్' 'జై కేటీఆర్' అంటూ నినదించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు సభలోపల ఎంత మందైతే ఉన్నారో బయట అంతకు రెండింతలు కనిపించారు. సభ పూర్తయిన తర్వాత కేటీఆర్‌ను కలిసేందుకు కార్యకర్తలు పోటీపడ్డారు. ఆయనతో సెల్ఫీలు దిగడానికి ఉత్సాహం చూపారు. మొత్తంగా బీఆర్‌ఎస్ సభ విజయవంతం కావడంతో శ్రేణుల్లో కొత్త జోష్ కనిపించింది.

ఒక్కరినీ తొలగించినా ఉద్యమమే!

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హామీలిచ్చి.. ఇప్పుడుతొలగింపా?
- రిటైర్మెంట్ పొందిన ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి
- వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి
- శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పలు శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులలో ఒక్కరిని తొలగించినా.. తెలంగాణ ఉద్యమం తరహాలో ఉద్యమం చేస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ సర్కారును హెచ్చరించారు. విధుల నుంచి తొలగిస్తే వాళ్లతోపాటు వారి కుటుంబాలూ రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రతో కలిసి ఆదివారం ఆయన మీడియాతో మట్లాడారు. రాష్ట్రంలో సుమారు 1.20 లక్షల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని, వారు రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఎక్కువగా కష్టపడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా వాణిజ్య, రవాణా శాఖలతో పాటు కార్మిక శాఖలో వారి సంఖ్య అధికంగా ఉందని, వారి సేవల వల్లే ఆయా శాఖల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధిక ఆదాయం వస్తుందని గుర్తుచేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కేసీఆర్ కడుపులో పెట్టుకుని చూసుకున్నారని, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వారిని అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయక పోగా.. ఉన్న ఉద్యోగులను తొలగించడమేమిటని ప్రశ్నించారు. ఛాయ్ తాగేలోపే జీవో ఇస్తామని చెప్పి.. ఇప్పుడు తొలగించడం ఏమిటని నిలదీశారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ బకాయిలు పేరుకుపోయాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెచ్చింది అప్పులు కాదు.. రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు

కేసీఆర్ హయాంలో రాష్ట్రానికి తెచ్చింది అప్పులు కావని, తెలంగాణ అభివృద్ధి కోసం తెచ్చిన పెట్టుబడులని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. ఆ పెట్టుబడి నిధులతోనే గురుకులాలు, సాగునీటి ప్రాజెక్టులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత తదితర పనులు చేపట్టినట్టు వివరించారు.

మాట నిలుపుకొన్న కేటీఆర్

- సొంత ఖర్చుతో అభిమానికి టీస్టాల్ ఏర్పాటు
- సిరిసిల్లలో స్వయంగా ప్రారంభించిన కేటీఆర్
- గతంలో కేటీఆర్ ఫొటోచూసి సిబ్బంది తొలగింపు
- ఆనాడే బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చిన నేత

సిరిసిల్లలో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ రమణ, టీస్టాల్ నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, మార్చి 23: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఓ అభిమానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తన సొంత ఖర్చులతో టీస్టాల్‌ను ఏర్పాటు చేసిన ఆయన ఆదివారం స్వయంగా ప్రారంభించారు. దీంతో ఆ అభిమాని కుటుంబానికి అవధులే లేవు. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్ద కొంతకాలంగా కేటీఆర్ అభిమాని అయిన బత్తుల శ్రీనివాస్ టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఆయన పాల్గొన్నాడు. కేటీఆర్‌పై ఉన్న అభిమానంతో హోటల్‌కు 'కేటీఆర్ టీస్టాల్' అని పేరుతోపాటు కేటీఆర్ ఫొటోల ఫ్లెక్సీతో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కేటీఆర్ ఫొటో ఉన్నదన్న కారణంతో ట్రేడ్ లైసెన్సు లేదన్న సాకుతో ఇటీవల మున్సిపల్ అధికారులు హోటల్‌ను క్రేన్‌తో అక్కడి నుంచి తొలగించారు. దీంతో టీస్టాల్‌తో బతికే శ్రీనివాస్ కుటుంబానికి ఆధారం పోయింది. శ్రీనివాస్ హోటల్‌ను తొలగించిన సమాచారం తెలుసుకున్న కేటీఆర్ వారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం కల్పించారు. సిరిసిల్ల పర్యటనకు వచ్చిన సందర్భంలో కేటీఆర్‌ను బాధిత శ్రీనివాస్ కుటుంబసభ్యులు కలవగా తన సొంత ఖర్చులతో టీస్టాల్‌ను ఏర్పాటు చేయిస్తానని బాధిత కుటుంబానికి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం స్థానిక గాంధీచౌరస్తాలో నూతన హంగులతో తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన టీస్టాల్‌ను ఆదివారం ఎమ్మెల్సీ రమణతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు.

జీవితాంతం కేటీఆర్ అన్నకు రుణపడి ఉంటా: శ్రీనివాస్

తన సొంత ఖర్చులతో హోటల్‌ను ఏర్పాటుచేసిన కేటీఆర్‌కు ఈ సందర్భంగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. 'అన్నలా తనకు అండగా నిలిచిన కేటీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటా' అని శ్రీనివాస్ సంతృప్తిని వ్యక్తంచేశాడు. 'సార్ పేరు పెట్టుకున్నవ్.. హోటల్‌కి కేటీఆర్ బ్రాండ్ నిలబెట్టాలి' అంటూ ఈ సందర్భంగా టీ తాగుతూ శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ రమణ సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ జిందం కళ, బీఆర్‌ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైపై ఫిర్యాదు చేస్తాం

- నందయ్యకు కేటీఆర్ పరామర్శ

బోయినపల్లి (వేములవాడ), మార్చి 23: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి ఎస్సై తీరుపై మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఇటీవల అక్రమంగా పోలీసులు అరెస్టు చేసిన మాజీ సర్పంచ్ నందయ్యను మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, చల్మెడ లక్ష్మీ నరసింహారావు, రమణతో కలిసి ఆయన నివాసంలో ఆదివారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

డీలిమిటేషన్‌కు బీఆర్‌ఎస్ వ్యతిరేకం

- దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం
- తెలంగాణ హక్కులకు తీవ్ర విఘాతం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బండి సంజయ్ ఆధారాలు ఉంటే చూపాలని కరీంనగర్‌లో డిమాండ్

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): కేంద్రం చేపట్టబోయే డీలిమిటేషన్‌కు తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని, ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం రాత్రి చైన్నైలో ఓ మీడియా చానల్‌తో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ప్రగతిశీల రాష్ట్రంగా ఉన్న తెలంగాణ దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నదని, దేశ జనాభాలో తెలంగాణ 2శాతం ఉంటే జీడీపీకి 5శాతం సమకూర్చడం గర్వకారణమని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన చేపడితే తెలంగాణతో దక్షిణాది రాష్ట్రాల గొంతుకలు పార్లమెంట్‌లో వినిపించకుండా పోయే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌తో ఎలాంటి అన్యాయం జరగదని ఇక్కడి బీజేపీ నాయకులు చెప్పడం విడ్డూరమని చెప్పారు. అదే నిజమైతే మాటలు కట్టిపెట్టి చట్టంలో పెట్టాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌తో మాట్లాడిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని కేటీఆర్ వెల్లడించారు.

'బండి' సన్నాసి మాటలెందుకు?

బీఆర్‌ఎస్ బీదర్‌లో నకిలీ నోట్లు ముద్రించి గత అసెంబ్లీ ఎన్నికల్లో పంచిపెట్టిందన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణలను కేటీఆర్ కొట్టిపారేశారు. మంత్రి పదవిలో ఉన్న ఆయనకు కరీంనగర్‌కు ఓ బడి కూడా తేవడం చేతగావడం లేదని కడిగిపారేశారు. ఆదివారం కేటీఆర్ కరీంనగర్‌లో ఓ మీడియా చానల్‌తో మాట్లాడారు. 'సంజయ్ ఈ సన్నాసి మాటలెందుకు? పనికిమాలిన డైలాగులెందుకు?' అని నిలదీశారు. అప్పుడు కేంద్రంలో, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయని, సంజయ్‌కు దమ్ముంటే ఆధారాలు బయటపెట్టి విచారణ కోరాలని డిమాండ్ చేశారు.

మిర్చి దండలు.. నమూనా స్కూటీలు

- శాసనమండలి సమావేశాల్లో బీఆర్‌ఎస్ వినూత్న నిరసనలు
- రోజుకో తీరు నిరసనతో ఆకట్టుకుంటున్న మండలి సభ్యులు
- సమస్యలను ఎలుగెత్తి చాటడంపై వెల్లువెత్తుతున్న ప్రశంసలు
- జాతీయ మీడియా, సోషల్ మీడియాలోనూ విస్తృత చర్చలు

విద్యార్థినులకు స్కూటీలు ఎప్పుడిస్తారంటూ నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు (ఫైల్)

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రజా సమస్యలను ఎత్తిచూపేందుకు బీఆర్‌ఎస్ సభ్యులు వినూత్న పంథాలో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్ శాసనమండలి సభ్యులు రోజుకోతీరు నిరసనతో ఆకట్టుకుంటున్నారు. మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో, ఎమ్మెల్సీ కవిత మార్గదర్శకత్వంలో మండలి ఆవరణలో ఆందోళనలకు దిగుతున్నారు. ఓ రోజు మెడలో మిర్చిదండలతో వచ్చి మద్దతు ధరలేక అల్లాడుతున్న రైతాంగానికి అండగా నిలిచారు. మరోరోజు ఎండిన వరి కంకులతో వచ్చి రైతుల బాధలను వెలుగులోకి తెచ్చారు. ఇంకోరోజు నమూనా స్కూటీలను ప్రదర్శించి ఆరు గ్యారెంటీల్లో భాగంగా విద్యార్థినులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు.

సమావేశాల మొదటి రోజు నుంచే..

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు మార్చి 13న మధుసూదనాచారి, కవిత, సత్యవతి రాథోడ్, సురభి వాణీదేవి, మహమూద్‌అలీ, ఎల్ రమణ, దేశపతి శ్రీనివాస్, వెల్లంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, తాతా మధు, శంభీపూర్ రాజు, సత్యనారాయణ తదితరులు పసుపునకు మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. 17న మిర్చి దండలు, ఆకుపచ్చని కండువాలతో ఆందోళన చేశారు. మిర్చి పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. 18న స్కూటీ నమూనా చిత్రాలను ప్రదర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు 18 ఏండ్లు నిండిన మహిళలు, విద్యార్థినులకు స్కూటీలు ఎప్పుడిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 19న ఎండిన వరి కంకులతో వచ్చి నిరసన తెలిపారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

జాతీయ మీడియాలోనూ ఆసక్తికర చర్చ..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల నిరసనలతో సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న తీరు జాతీయ మీడియాను సైతం ఆకర్షిస్తున్నది. టీవీ చానళ్లు, వివిధ ఆంగ్ల పత్రికల్లో కథనాలు ప్రసారమవుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రజల సమస్యలు, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. సోషల్ మీడియాలోనూ ఆసక్తికర చర్చ జరుగుతున్నది.

ప్రభుత్వంపై పెరుగుతున్న ఒత్తిడి..

బీఆర్‌ఎస్ సభ్యుల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్నది. సత్వరమే స్పందించడమే కాకుండా పరిష్కారానికి ఉపక్రమించాల్సి వస్తున్నది. తెలంగాణతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, అమల్లో ప్రభుత్వ వైఫల్యాలపై చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ అధినాయకత్వం సైతం ఇక్కడి పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ కాంగ్రెస్

- అసెంబ్లీ సాక్షిగా రుణమాఫీపై మంత్రుల పచ్చి అబద్ధాలు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆగ్రహం

సూర్యాపేట, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : హామీలను అమలు చేయకుండా, పూటకో అబద్ధం, రోజుకో మోసం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. రుణమాఫీ విషయంలో అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ రుణమాఫీ మోసం, బీజేపీ డీలిమిటేషన్ కుట్రలపై ఆదివారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి చేతులెత్తేసి, చేయని రుణమాఫీ చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డీలిమిటేషన్ విషయంలో దక్షిణాదికి నష్టం జరుగుతుందని తెలిసి కూడా మంత్రి పదవిని కాపాడుకునేందుకు అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ హక్కుల సాధన కోసం బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు.

మళ్లీ ప్రశ్నోత్తరాలు రద్దు

- ఇప్పటికే రెండుసార్లు రద్దు చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ప్రభుత్వం పారిపోతున్నదని బీఆర్‌ఎస్ నేతల విమర్శలు

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత అసెంబ్లీ సెషన్‌లో ప్రశ్నోత్తరాలు రద్దు చేయడం పరిపాటిగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు రద్దు చేసిన స్పీకర్.. తాజాగా సోమవారం మరోసారి రద్దుచేస్తున్నట్టు ప్రకటించడంతో ఈ సీజన్‌లో మూడుసార్లు ప్రశ్నోత్తరాలు రద్దు చేసినట్టయ్యింది. దీనిపై బీఆర్‌ఎస్ అసంతృప్తి వ్యక్తంచేసింది. ప్రభుత్వం తమ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పారిపోతున్నదని ఆరోపించింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. తమ నియోజకవర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది. ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తేనే ప్రజాసమస్యలు చర్చకు వస్తాయని పేర్కొంటున్నారు. సోమవారం అసెంబ్లీలో పురపాలక, పట్టణాభివృద్ధి, సోషల్, ట్రైబల్, మైనార్టీ వెల్ఫేర్, పరిశ్రమలు, ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల పద్దులపై చర్చ జరుగనున్నది.